లోపాలు సరిచేసుకోండి

పాల ఉత్పత్తిదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పామర్రు: ప్రస్తుతం పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో పాడి రైతులు పాలు పితికే సమయంలో, వాటిని కేంద్రాలకు తరలించే సమయంలో కొన్ని జాగ్రత్తలను పాటిస్తే అధిక లాభాలు పొందువచ్చని పశుసంవర్ధక శాఖ పామర్రు సహాయ సంచాలకులు వీ మధుసూదన రావు పేర్కొన్నారు. పాలు తీసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన తెలిపారు. అవి ఇవే..

- పాలు పితకడానికి ముందు నేలను ఉడ్చి నీటితో కడగాలి.
- చుట్టు పక్కల బురద కాలువలు, పేడ కుప్పలు ఉండరాదు.
- పాలు పితికే ముందు పాడి పశువును గోరు వెచ్చని నీటితో కడగాలి. పొదుగును పరిశుభ్రంగా కడగాలి. అలా కుదరక పోతే పొదుగును కడిగి పొడి గుడ్డతో తుడవాలి.
- పాలు పితికే వ్యక్తి చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- తడి చేతులతో పాలు పితకరాదు. మధ్యలో చేతులు తడి చేసుకోరాదు.
- ముందు పితికిన పాలలో సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండి, వెన్న శాతం తక్కువగా ఉంటుంది.


గేదె పాలు తీస్తున్న పశుపోషకుడు

అందువల్ల ముందుగా పాలు దూడకు వదలాలి. వెనుక తీసిన పాలను కేంద్రానికి పోయాలి.

- పాలు తీసేందుకు స్టీలు, అల్యూమినియం పాత్రలనే వాడాలి. ఇనుప పాత్రలు వాడితే పాలు త్వరగా చెడిపోతాయి.
- వెచ్చటి వాతావరణంలో సూక్ష్మజీవులు బాగా వృద్ధి చెంది పాలలోని చెక్కరను ఆమ్లంగా మార్చి పాలు త్వరగా చెడిపోతాయి. 25 నుంచి 50 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి.
- పాలను నిల్వ చేసేందుకు తినే సోడా(సోడియం బై కార్బొనేట్), చాకలి సోడా(సోడియం కార్బొనేట్)ను పాలలో కలుపరాదు.
- పాలల్లో నీళ్ల కలపడం వల్ల వెన్న శాతంతో పాటు మిగిలిన ఘన పదార్థాలు కూడా తగ్గిపోతాయి. దీంతో పాల రేటు కూడా తగ్గిపోతుంది.
- చుట్టు పక్కల గల వాసనను పాలు వెంటనే గ్రహిస్తాయి. కాబట్టి ఉల్లి, వెల్లుల్లి, ఎండు చేపల వాసన, మురుగునీటి వాసన వస్తే ఆ వాసనను పాలు గ్రహించి పులిసిన వాసన పాలకు వస్తాయి.
- పాలు పితికిన వెంటనే పరిశుభ్రమైన గుడ్డతో వడకట్టాలి.
- రాత్రి తీసిన పాలలో తాజా పాలు కలపరాదు. తాజా పాలు కొంచెం తియ్యటి వాసన కలిగి ఉంటాయి.
- గేదె ఈనిన 15 రోజుల వరకూ పాల కేంద్రాలకు పాలను పోయకూడదు. జున్ను పాలు కలిస్తే మంచి పాలు కూడా చెడిపోతాయి.
- పాలల్లో ఎరుపుజీర, తరకలు కనిపిస్తే పొదుగు వాపుగాని, గాయం గాని ఉండి ఉండవచ్చు. వెంటనే పశువైద్యుడిని సంప్రదించాలి.
- పాలు పూర్తిగా పితకకుండా మెల్లమెల్లగా నగం వరకే పితికినా తక్కువ వెన్న శాతం వస్తుంది.

పై నియమాలను పాటించి పాలను సేకరిస్తే పాలకు మంచి వెన్న శాతం ఏర్పడి అధిక మొత్తంలో లాభాలు వస్తాయి.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తోట్లవల్లూరు: అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని బొడ్డపాడులో ఔటర్ రింగ్‌రోడ్డు భూసేకరణకు సంబంధించి శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ బొడ్డపాడు, చినపులిపాక, నార్తువల్లూరు, సౌత్‌వల్లూరు మీదుగా ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణం జరగనుందని తెలిపారు. దీనికి సంబంధించి లాజిస్టిక్ పార్కు కోసం 80 ఎకరాల భూమి కావాల్సి ఉందన్నారు. భూసేకరణకు రైతులు తమ వంతు సహకారం అందించాలని ఆయన సూచించారు. రింగ్ రోడ్డు నిర్మాణం జరిగితే బొడ్డపాడు, చినపులిపాక, నార్తువల్లూరు, సౌత్‌వల్లూరు గ్రామాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని తెలిపారు. ఉయ్యూరు ఆర్‌డీఓ డి.రాజు, సర్పంచ్ మూడే శివశంకరరావు, తహసీల్దార్ కుసుమకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్, మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బొడ్డపాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

అగ్ని బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

తోట్లవల్లూరు: రొయ్యూరు వద్ద కృష్ణా కరకట్టపై లుక్కా రామాంజనేయులు, దర్శే రత్నకుమారికి చెందిన రెండు బడ్డీ కొట్లు శనివారం వేకువజామున జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. బాధితులను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ మండల కార్యదర్శి లుక్కా రేణుకారావు, నాయకులు ఉప్పులూరి గోపాలకృష్ణ, లుక్కా వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు(ఏపీయూడబ్ల్యూజే) యూనియన్ ఆవిర్భావ దినోత్సవం కైకలూరు ప్రెస్ క్లబ్ వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ జెండా ఎగురవేసిన అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గుడివాడరూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటామని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు పేర్కొన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఆవరణను ఎస్ఐ పర్యవేక్షణలో శనివారం పోలీస్ అధికారులు, సిబ్బంది క్లీన్ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో ప్రజలందరూ కూడా తమ ఇళ్ల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అఘాయిత్యాలు జరగకుండా చూడాలి

గుడివాడరూరల్: మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా గ్రామాల్లో మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎస్.చంటిబాబు సూచించారు. గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మహిళా పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లోని ఎక్కడైనా మహిళలు, చిన్నారుల పట్ల దాడులు జరిగినా, వేధింపులకు గురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రస్తుతం చాలా చోట్ల సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



పమిడిముక్కల: వీరంకిలాకులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో అన్నపురెడ్డి అప్పన్నకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబానికి ఉయ్యూరుకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్ గుర్రాల మధుసుదనరావు రూ.10 వేల సాయం, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో వంగవీటి శ్రీనివాసప్రసాద్, దాసరి వెంకటేశ్వరరావు, శీలం రాజా పాల్గొన్నారు.

ఫత్తేలంకలోని వక్ఫ్ భూముల సర్వేకు ఆదేశం

పమిడిముక్కల: ఫత్తేలంక గ్రామంలో రైతుల ఆక్రమణలో ఉన్న 32 ఎకరాల 69 సెంట్ల వక్ఫ్ భూములను సర్వే చేసేందుకు జిల్లా వక్ఫ్ బోర్డు అధికారి జి.శ్రీదేవి జిల్లా సర్వే అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. భూముల ఆక్రమణపై తాను జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మసీదు మాన్యం భూములను వెంటనే సర్వే జరిపించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



పెదపూడి(మొవ్వ): మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కూచిపూడి శాఖ ఆధ్వర్యంలో శనివారం పెదపూడి, కూచిపూడి గ్రామాల్లోని ఐదు పాఠశాలల్లోని విద్యార్థులకు రూ.14 వేల విలువ గల విద్యోపకరణాలను పంపిణీ చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న 51 మంది విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్స్, నోటు పుస్తకాలతో కూడిన కిట్లను ఆయా పాఠశాలల్లో అందజేశారు. ఇందులో భాగంగా పెదపూడి ఎంపీయూపీ పాఠశాల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్ నాగమల్లేశ్వరరావు, మానవత సేవా సంస్థ చైర్మన్ పిట్టు శ్రీనివాసరావు, అధ్యక్షుడు తాళ్లూరి మోహనకుమార్ విద్యార్థులకు కిట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్లు పాగోలు రమేష్‌బాబు, పసుమర్తి శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు కంచర్ల నిర్మల పాల్గొన్నారు.

చెరువుల లీజు వేలం వాయిదా

ముదినేపల్లి రూరల్: మండలంలోని వణుదుర్రు పంచాయతీ పరిధిలో ఉన్న 12 చెరువుల లీజు వేలాన్ని వాయిదా వేశారు. ఈ చెరువులను మూడేళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు వేలం నిర్వహించగా సరైన అప్‌సెట్ ధర రాకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. పంచాయతీ కార్యాలయంలో ఈఓపీఆర్డీ దూలం లక్ష్మీనారాయణ ఈ వేలాన్ని నిర్వహించారు. అప్‌సెట్ ధరకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేయాల్సివచ్చినట్లు తెలిపారు. పంచాయతీ శివారు కొత్తపల్లిలోని మలరాజ చెరువులు జలజీవన్ మిషన్ కింద తాగునీటి పథకం నిర్మాణం చేపట్టినందున ఈ చెరువుకు వేలం పాట రద్దు చేసినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలోని 12 చెరువులకు గానూ వేలంపాటలు నిర్వహించగా కేవలం మూడు చెరువులకు మాత్రమే అప్‌సెట్ ధర రావడంతో పాటలు ఖరారు చేసినట్లు తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

గుడివాడరూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్ పేర్కొన్నారు. టూటౌన్ సీఐగా ఆయన శనివారం బాధ్యతలు చేపట్టారు. తొలుత స్టేషన్ అధికారులు, సిబ్బంది సీఐకు ఘనస్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎక్కడైనా పేకాట, కోడిపందేలు తదితర చట్టవ్యతిరేక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే ఆయా ప్రాంతాల్లోని ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కాగా ఇక్కడ సీఐగా పనిచేసిన ఎం.నాగదుర్గారావు కాకినాడకు బదిలీపై వెళ్లారు.

పమిడిముక్కల సీఐగా చిట్టిబాబు

పమిడిముక్కల: పమిడిముక్కల సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై.చిట్టిబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సీఐ కిషోర్‌బాబును విజయవాడ ఫోర్త్ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. కాకినాడ సీసీఎస్‌లో పనిచేసిన చిట్టిబాబును పమిడిముక్కల సీఐగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకు సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.


టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్


పమిడిముక్కల సీఐ చిట్టిబాబు

ఘంటసాల కళాపీఠం గౌరవాధ్యక్షుడిగా మనోహర్

పామర్రు: పద్మశ్రీ ఘంటసాల కళాపీఠం గౌరవాధ్యక్షుడిగా ఐపీఎస్ మనోహర్‌ను ఎంపిక చేసినట్లు కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ అన్నారు. స్థానిక హితమ్ స్కూల్లో కళాపీఠం సభ్యులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కళాపీఠం గౌరవాధ్యక్షుడిగా ఐపీఎస్ మనోహర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ కళా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి సేవా కార్యక్రమంలో మనోహర్ పాల్గొని తన సేవలను పీఠానికి అందజేశారన్నారు. ఈ సేవలను గుర్తించిన పీఠం మనోహర్‌కు గౌరవాధ్యక్ష పదవి ఇచ్చి గౌరవించినట్లు పేర్కొన్నారు. పామర్రులోని అన్న క్యాంటిన్‌కు మనోహర్ రూ.25 వేల సాయం అందజేశారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తుగా మనోహర్ దంపతులను సన్మానించామన్నారు. కార్యక్రమంలో కళాపీఠం కార్యదర్శి హేమంత్‌రెడ్డి, సభ్యులు పరిశ వెంకట నాంచారయ్య, రాజబాబు పాల్గొన్నారు.


మనోహర్ దంపతులను సన్మానిస్తున్న కళాపీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ

భక్తుల కిటకిట

పమిడిముక్కల: శ్రావణమాసం రెండో శనివారం మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈఓ మాధవీలత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

కైకలూరు: రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా పేర్కొన్నారు. మండలంలోని వింజరంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు స్థానిక వీఏఏల ద్వారా ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వర్తింపు, ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసేందుకు ఈ-పంట నమోదు తప్పనిసరి అని తెలిపారు. అనంతరం కైకలూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో కైకలూరు, కలిదిండి మండలాల ఎరువులు, పురుగు మందుల విక్రయ డీలర్లతో సమావేశమయ్యారు. నిబంధనలకు అనుగుణంగా విక్రయాలు చేయాలన్నారు. ఏడీఏ ఆర్.గంగాధరరావు ఎరువుల విక్రయాల్లో కొత్త చట్టాలపై డీలర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆర్.దివ్య, ధర్మరాజుల సూర్యనారాయణ పాలొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలో సార్వా వరిసాగు చేసే రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు అనేక ప్రయోజనాలున్నాయని తెలిపారు. అలాగే రైతులు వెదజల్లిన వరిచేలల్లో కలుపు నివారణకు మందులు ఉపయోగించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


వింజరంలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న హబీబ్ బాషా

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

కాజ(మొవ్వ): ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో మొవ్వ మండలం కాజ గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయవాడకు చెందిన సీసీఆర్ఏఎస్ వైద్యనిపుణులు డాక్టర్ ఏజేవీ సాయి ప్రసాద్, కాజ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఎం.భాగ్యలక్ష్మి 158 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరానికి గ్రామ సర్పంచ్ కొడాలి భవాని, ఉపసర్పంచ్ మంద శ్రీనివాస రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ నారాయణరావు తదితరులు సహాయ సహకారాలు అందించారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

గుడివాడరూరల్: డ్యూటీలో ఉన్న డాక్టర్లకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సీపీఎం పార్టీ డివిజన్ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోలకతాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌ను అతి కిరాతకంగా రేప్ చేసి చంపడం దారుణమన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో పట్టణ ఐద్వా కార్యదర్శి పి.రజని పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఆర్సీపీ రెడ్డి

వైద్యులకు రక్షణ కల్పించాలి


కైకలూరులో ర్యాలీ చేస్తున్న వైద్యులు


కైకలూరు గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఆర్ఎంపీల నిరసన

కైకలూరు: విధి నిర్వహణలో ఉన్న వైద్యులకు రక్షణ కల్పించాలని డాక్టర్లు కోరారు. ఐఎంఏ పిలుపు మేరకు కైకలూరులో అన్ని ఆస్పత్రుల వైద్యులు శనివారం సేవలను నిలిపేసి నిరసన తెలిపారు. కోల్‌కతాలో డ్యూటీలో ఉన్న డాక్టర్‌ను హత్యాచారం చేయడం దారుణ విషయమని డాక్టర్ పీవీవీ పుల్లేశ్వరరావు అన్నారు. డాక్టరు ప్రశాంతి మాట్లాడుతూ వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలన్నారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వైద్యులకు రక్షణ కల్పించాలని వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు పిచ్చయ్య చౌదరి, రాజ్‌గోపాల్, కామినేని సురేఖ, పూర్ణచంద్రరావు, జ్యోతిరాణి, విద్యాసాగర్, ప్రియ, రవీంద్ర, హరీష్ పాల్గొన్నారు.


ఆర్ఎంపీల ఆధ్వర్యంలో..

అనుభవ సంఘాల సమైక్య, ఎఫ్ఈఎంపీఏ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు కైకలూరు ఏరియా గ్రామీణ వైద్యులు కైకలూరు గాంధీ బొమ్మ సెంటర్లో ర్యాలీ చేశారు. వైద్యులపై దాడులు చేస్తున్న వారికి కఠిన శిక్షలు విధించాలన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఏరియా అధ్యక్షుడు ఎం.విజయకుమార్, సెక్రెటరీ లంకపల్లి రవి, ట్రెజరర్ జనార్ధన్, ఉమామహేశ్వరరావు, అశోక్‌కుమార్, సూర్యప్రకాష్, బలరాంమూర్తి, వీరస్వామి పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తే గుర్తింపు

ముదినేపల్లి రూరల్: అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహిస్తే ప్రజల్లో గౌరవం, గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ఎన్నికల ముందు ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన గంగాధరరావు బదిలీపై తూర్పుగోదావరి జిల్లాకు వెళ్లగా నూతన ఎంపీడీఓగా పి.మల్లీశ్వరీ బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా మండలంలో పనిచేస్తున్న నలుగురు కార్యదర్శులు ఉద్యోగోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. వీరికి శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అభినందన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు రాజకీయాలకతీతంగా విధులు నిర్వహిస్తే ప్రజలు ఎల్లప్పుడూ వారిని గుర్తుంచుకుంటారన్నారు. అధికారులు ఉద్యోగులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఓ రమణరావు, సిబ్బంది సుబ్బారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీకి డీఎన్నార్ పరామర్శ


వైస్ ఎంపీపీ జహీర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్ ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం కైకలూరులోని జహీర్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. డీఎన్నార్ వెంట పార్టీ నాయకులు ఉండ్రమట్ల యేసు, పంజా నాగు ఉన్నారు.

రేపు మండవల్లిలో కృష్ణాలయం ప్రారంభం

మండవల్లి: మండవల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణాలయం ఆదివారం ఉదయం ప్రారంభించనున్నట్లు యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బహుముఖ ప్రతిభాశాలి రామలింగశాస్త్రి

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి అని నాట్యాచార్యుడు డేగల సాంబశివరావు అన్నారు. శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నృత్య నీరాజనం 2024, నాట్యాచార్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రికి గురు సత్కార కార్యక్రమం నిర్వహించారు, సాంబశివరావు మాట్లాడుతూ కూచిపూడి నాట్య సంప్రదాయ కుటుంబానికి చెందిన రామలింగశాస్త్రి కూచిపూడి సిద్ధేంద్రయోగి పీఠం ఆచార్యుడిగా విశేష సేవలను అందించినట్లు తెలిపారు. వందలాది మందికి కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. వాగ్దేవీ కూచిపూడి నృత్యాలయ వ్యవస్థాపకుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ కూచిపూడి గ్రామం నేడు అంతర్జాతీయ కీర్తి వచ్చిందంటే కూచిపూడి నాట్యమే కారణమని తెలిపారు. నాట్యాచార్యుడు రామలింగశాస్త్రి దంపతులను శివకుమార్ దంపతులు వేదోక్తంగా గురువందన కార్యక్రమం నిర్వహించారు. నాట్యాచార్యులు పిల్లా ఉమామహేశ్వర పాత్రుడు, వాణిజ్యశాఖ అధికారి, వీసీవీవీడీఎస్ కుమార్, ఘంటసాల పవన్‌కుమార్, మాగలూరి త్రినాథాచారి, డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాట్యాచార్యులు, చిన్నారులు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు శ్రీ వెంకటేశ్వర, బసవనంది పురస్కారాలతో సత్కరించారు.


డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి దంపతులకు గురువందనం నిర్వహిస్తున్న దృశ్యం

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్‌లో ఉచిత శిక్షణ

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్‌హబ్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.పద్మావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ చదివిన నిరుద్యోగ యువతి, యువకులు అర్హులని తెలిపారు. నూతన సాంకేతికతను ఉపయోగించి నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 94940 05725 నంబర్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.